1987 దీపావళి కథల పోటీలో రు.700/-లు బహుమతి పొందిన కథ

"సైలెన్స్...

అల్లరి చేయకుండా ఎవరి సీట్లలో వాళ్ళు కూచోండి" కోపంగా అంటూ అప్పుడే లోపలికొచ్చారు విశ్వనాథం మేష్టారు.

ఆయన అరుపుకి పిల్లలందరూ బిక్కు బిక్కుమంటూ వెళ్ళి ఎవరి సీట్లలో వాళ్ళు కూలబడ్డారు వొకరి నొకరు తోసుకుంటూ

విశ్వనాథంగారు సంచీలోంచి ఆన్సర్ పేపర్ల కట్ట బయటకు తీసి, ముందున్న టేబిలు మీదుంచి, కుర్చీలో వెనక్కి జారగిలబడి కూర్చున్నారు

ఆయన కళ్ల కింది చీకటి నీడలు వయోభారాన్ని గుర్తు చేస్తున్నాయ్

జీవితంలో ప్రతి మజిలీకి అలసిపోయినట్లు ముఖం మీద మడతలు స్పష్టం చేస్తున్నాయి అలసటగా ఓ లిప్తపాటు ఆయన కళ్ళు మూతపడ్డాయ్

అటువంటి అదను కోసమే ఎదురు చూస్తున్న క్లాసు పిల్లలందరూ మళ్ళీ గుస గుసలు మొదలెట్టారు ఎవరెవరికి ఏ ర్యాంకు వచ్చిందో ఇంకాసేపట్లో వినబోతున్నామనే ఆత్రుత పిల్లల ముఖాల్లో స్పష్టంగా కనబడుతోంది అయినా కొంతమందిలో నిర్లక్ష్యం కొంతమంది తమలో తామే నవ్వుకుంటున్నారు ఒకళ్ళని ఒకళ్ళు తోసుకుని కుమ్ములాడుకుంటున్నారు

క్లాసు రూములో మళ్ళీ అలజడి

అది గమనించిన మేష్టారు మెల్లగా కుర్చీలోంచి లేచి డస్టరుతో బల్లమీద కొట్టి 'సైలెన్స్!' ఎవరైనా అల్లరి చేస్తే దెబ్బలు పడతాయ్ జాగ్రత్త



హెచ్చరించారు

పిల్లలందరూ కిమ్మనకుండా కూర్చున్నారు

అంతసేపూ పిల్లల అల్లరితో రొణగొణ ధ్వనితో గందరగోళంగా వున్న క్లాసులో నిశ్శబ్దం ఆవరించింది

మేష్టారు బల్ల మీదున్న పేపర్ల కట్ట ఊడదీశారు క్లాసంతటినీ ఒక్కసారి పరికించి చూశారు ఆయన చూపులో ఓ విచిత్రమైన గంభీరత చోటు చేసుకుంది

అబ్బాయిలూ!

ఆ పిలుపుకి పిల్లలందరూ ఒక్కసారిగా ఆయన వంక చూశారు

ఒక్క నాగభూషణం తప్పించి మిగతా వారందరూ పాసయ్యారు

నాగభూషణం అనే కుర్రవాడు ఉలిక్కి పడినట్లుగా చూశాడు

మిగతా పిల్లలంతా పాసయిన ఆనందంతో ఓ అంటూ అరిచారు

సైలెన్స్!

మళ్ళీ నిశ్శబ్దం

ఈసారి ఫస్టు ర్యాంక్ ఎవరికొచ్చిందో తెలుసా?

బాగా చదివే అతి కొద్దిమంది ఎల్లలు ఆదుర్దాగా చూశారు ఆయన వంక మధ్యస్థంగా చదివే ఎల్లలు ఉత్సుకతతో చూడసాగారు ఓ మోస్తరుగా చదివేవాళ్ళు మాత్రం నిర్లిప్తంగా చూడసాగారు

సమాధానంగా ఆయన చూపులు తిన్నగా మూడో బెంచీలో కూర్చున్న విద్యార్థుల వైపు మళ్ళాయి

ప్రతి చర్యగా పిల్లలందరూ అటు తిరిగి చూశారు

వెంటనే విశ్వనాథంగారు చిన్నగా నవ్వుతూ రమేష్ లేచి నిలబడు బాయనా అన్నారు

రమేష్ తన సీట్లో లేచి నిలబడ్డాడు కాస్త కంగారు కొంత సంభ్రమంగానూ

ఈ సంవత్సరం కూడా ఫస్టు ర్యాంకు నీకే వచ్చింది బాబూ!

ఆ పిల్లవాడి ముఖం ఆనందంతో వెలిగిపోయింది

శ్రద్ధగా చదువుకున్నందుకు నీ కృషి ఫలించింది! మే గాడ్ బ్లెస్ యూ' అని దీవించారు

కృతజ్ఞతా పూర్వకంగా రమేష్ మేష్టారి వద్దకు వచ్చి ఆయనకు నమస్కరించి వెళ్ళి తన సీట్లో కూచున్నాడు

"రెండు మూడు ర్యాంకులు శరత్ సురేష్‌లకు వచ్చాయి

వాళ్ళిద్దరూ కూడా వెళ్ళి మేష్టారి ఆశీస్సులు అందుకున్నారు

మిగతా వాళ్ళందరూ సాధారణంగా పాస్ అయ్యారు మీరంతా ఇంకా బాగా చదవాలి వచ్చే సంవత్సరమయినా కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోండి అంటూ విశ్వనాథంగారు మెల్లిగా నడిచి వచ్చి ముందున్న బెంచీకి ఆనుకొని నిలబడి భూషణాన్ని తన దగ్గరకు రమ్మనమని చేత్తో సైగ చేశారు

ఈ క్లాసులో తనొక్కడే తప్పానని గిల్టీగా ఫీలవుతున్న భూషణం అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి ఆయన ఎదుట నిలబడ్డాడు

చూడు బాబూ! నువ్వు మొదటి నుంచీ చదువులో బాగా వెనకబడి వుంటున్నావు ఎన్నిమార్లు చెప్పినా చదవకుండా నా మాట పెడచెవిన పెట్టావు బాగా చదువుకుంటే నువ్వే వృద్ధిలోకి వస్తావు. లేకుంటే మధ్యలోనే ఆపేసి అతన్ని మరింత దగ్గరగా తీసుకున్నారు వెన్ను తడతూ వచ్చే సంవత్సరమయినా జాగ్రత్త పడాలి సుమా అని హితవు చెప్పారు

అది విన్న తర్వాత భూషణం దిగులుగా వెనక్కి వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు

ఇంతకాలం మీరందరూ నాతో చాలా సన్నిహితంగా వున్నారు అయితే మీలో కొందరు నా మంచితనాన్ని అలుసుగా తీసుకున్నారు మిగతా మేష్టర్లంటే మీకు హడల్ తప్పు చేస్తే వారంతా తీవ్రంగా దండిస్తారు కదా! మరి నేనలా చేయను అది నాకిష్టం వుండదు ఏదయినా మనంతట మనం తెలుసుకోవాలి అందుకే నేను మీ మాటల్ని చేతల్ని భరించాను మిమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆశించాను నేను ఆశించిన విధంగా మంచి అబ్బాయిలుగా రూపొందారని భావిస్తున్నాను ఇంకో విషయం స్కూలు చదువులయిపోయి పై చదువులకెళ్తే అక్కడా వాతావరణం ఇలాగే వుంటుందనుకోకండి పొరబడతారు జాగ్రత్త

ఆయన చెప్పేది ఎల్లలందరూ శ్రద్ధగా వింటున్నారు

ఇకపోతే నా స్వవిషయానికొస్తాను ఇదే చివరి క్లాసు నాకు మళ్ళీ మిమ్మల్ని కలుసుకొనే భాగ్యం ఎప్పటికో మీకందరికీ తెలుసు నేను ఈ రోజే రిటైర్ అయిపోతున్నానని

ఆ మాట అనేటప్పుడు ఆయన కంఠంలో రవ్వంత జీర

మిమ్మల్ని వదిలి వెళ్ళాలంటే బెంగగానే వుంది అయినా తప్పదు కదా మరి నా బిడ్డల్ని ఎంతగా ప్రేమించానో మిమ్మల్ని కూడా అంతగానే అభిమానించాను మీతో నా అనుభవం అనుపమానం ఎప్పటికయినా ఈ జీవితం అన్ని బంధాల్ని తెంచుకొని వెళ్ళి పోవాల్సిందే నాకంటే ధన్యుడు ఈ



లోకంలో వేరొకడుండడేమో! ఇంక నాకు టైమయిపోయింది సెలవిప్పించండి అని బారంగా తన ఉపన్యాసం ముగించేశాక

అన్నట్టు మరచాను అని ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా జేబులోంచి తాళం చెవులు తీస వాటితో పక్కనే వున్న బీరువా వోపెన్ చేస అందులో నుంచి ఓ సంచీ బయటకు తీసారు ఉబికి వస్తున్న బాదను కాస్త నిగ్రహించుకున్న తర్వాత ఇందులో ఏ మున్నాయో తెలుసా? నవ్వుతూ ప్రశ్నించారు అందరినీ

ఏముందో కనుక్కోవటం మీవల్ల కాదన్నట్టుంది ఆయన నవ్వు అప్పుడప్పుడు విశ్వనాథంగారు ఎంతో చమత్కారంగా నవ్వుతారు అదే నవ్వు మళ్ళీ ఇప్పుడు

ఆ సంచీలో ఏమున్నాయా! అని ఎల్లలందరూ సంశయంలో పడ్డారు!!!

ఎంత ఆలోచించినా వాళ్ళ కంతుబట్టలెదు

తెలీదన్నట్టు తలలూపారు ఎల్లలందరూ ఒకేసారి

మేష్టారు వెంటనే ఆ సంచీని చేత్తో పైకెత్తి ఇందులో డబ్బూ దస్కం దాయలేదు మరి ఎందుకింత జాగ్రత్తగా దాచుకున్నానో తెలుసా? ఐశ్వర్యం కంటే విలువయిన మీ ప్రేమని జాగ్రత్త చేస ఇందులో పదిలపరచాను సీరియస్‌గా క్లాసు జరుగుతూన్నప్పుడు మీలో కొందరు కోతి పన్లు చేస నే చెప్పే పాఠాన్ని డిస్టర్బ్ చేసే వాళ్ళు అప్పుడు మీ వద్ద నుంచి లాక్కొన్న కొన్ని వస్తువులు ఈ సంచీలో భద్రంగా దాచి వుంచాను అన్నారాయన నవ్వుతూ

అయినప్పటికీ మేష్టారి చేతిలో ఉన్న సంచీలో ఏమున్నాయో వాళ్ళు గ్రహించలేకపోయారు

ఒక్క రమేష్‌కి మాత్రం అర్ధమయింది లేచి నుంచొని చెబుదామనుకొన్నాడు కానీ మాష్టారి నోటంట వింటేనే హాయిగా వుంటుందని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు

మిగతా పిల్లల్లో ఉత్సుకత రెట్టింపయింది

అది గ్రహించిన విశ్వనాథంగారు ఆ సంచీలోంచి ముందుగా ఒక కాయితం రాకెట్‌ను బయటకు తీసారు

# వీడ్కోలు

దాని వంక ఆశ్చర్యంగా చూశారంతా

కృష్ణా!

ఉలిక్కిపడ్డాడు ఓ ఎల్లవాడు

నువ్వొకసారి దీన్ని నా మీదకు విసరావు! గుర్తుందా? రా! వచ్చి తీసుకెళ్ళు

సురేష్! నువ్వు నా మీద గిరాటేసిన అట్ట తేలు ఇదుగో!

'శరత్!'

'నా లాత్రీ వెనకాల నువ్వు కట్టిన రంగు దారం!'

పాఠం చెప్తుంటే చివరి బెంచీలో కూర్చుని అకతాయితనంగా ఆడుకున్న తాడూ బొంగరం భూషణం! వచ్చి తీసుకెళ్ళు

నీ బవిష్యత్ కూడా ఇలాగే తాడూ బొంగరం లేకుండా చేసుకోవద్దు

క్లాసులో గుస గుసలు మొదలయ్యాయి అయినా మేష్టారు పట్టించుకోలేదు

మూర్తీ! వచ్చి నీ విజిల్ తీసుకెళ్ళు బాబూ!

మూర్తి అనే కుర్రాడు నిర్ఘాంతపోయి చూశాడు ఆయన వంక, మేష్టారు అదేమీ గమనించలేదు,

రండి! రండి! దగ్గరకు వచ్చి ఎవరి వస్తువులు వాళ్ళు తీసుకెళ్ళండి చాలా రోజుల నుంచీ దాచి ఉంచాను ఇంక నావల్ల కాదు వీటిని బరించటం అని ప్రేమగా ఎలిచారు అందరినీ

మొదట్లో కొంచెం సంశయించినా వెంటనే ఎల్లలందరూ పరుగెత్తుకుంటూ వెళ్ళి మేష్టారి చుట్టూ మూగారు.

ఆయన ఆప్యాయంగా ఒక్కొక్కళ్ళ భుజం నిమురుతూ ఎవరి వస్తువులు వాళ్ళ కిచ్చేశారు

ఆ తర్వాత స్కూలు గంట మోగింది విశ్వనాథం గారి క్లాసులో ఎల్లలెవరూ కదల్లేదు అలాగే మంత్రముగ్ధులయి కూర్చుండి పోయారు

మిగతా క్లాసుల్లోని ఎల్లలందరూ కేరింతలు కొడుతూ ఇళ్ళకు బయలుదేరారు

స్కూలు గంట విన్న విశ్వనాథంగారి గుండెల్లో మాత్రం ఎక్కడో ఓ మూల నుంచి చిన్నగా వణుకు ప్రారంబమయి వొళ్ళంతా పాకింది ఆ గంట ఆయన గుండెల మీద కొట్టినట్లనిపించింది కళ్ళు చీకట్లు కమ్మాయి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పోయారు

ఆ క్లాసు రూమునీ ఎల్లల్ని వదిలి వెళ్ళాలంటే మనస్కరించడం లేదు తుది లేని ఆలోచనలెన్నో ఆయన మనసంతా ఆక్రమించాయి

అయినా ఆ ఎల్లల్ని వొదలలేక వొదలలేక మెల్లగా అడుగులు బయటకేసారాయన

అప్పుడు ఆ క్లాసులోని పిల్లలు కూడా ఆయనతోటే కదిలారు

అలా బయటకొచ్చిన విశ్వనాథంగారు స్టాఫ్ రూములో కెళ్ళి సహోధ్యాయులందరి వద్ద వీడ్కోలు తీసుకుని ఓ అర్ధ గంట తర్వాత బయటకొచ్చారు స్కూలుఆవరణ దాటి ఇంటి వైపు నడక సాగించారు

మేష్టారి కోసం అక్కడే నిలబడి ఎదురు చూస్తున్న ఎల్లలు ఆయన బయటకు రావడం చూస పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆయనతోటే గుంపుగా నడుస్తున్నారు

ఆ సంపటన విశ్వనాథంగారిని ఆనందంలో ముంచెత్తింది

వాళ్ళందరినీ ఆయన ప్రేమగా పలకరిస్తున్నారు వాళ్ళేసే ప్రశ్నలన్నింటికీ ఆయన ఓపిగ్గా సమాధానం చెప్తూ నడుస్తున్నారు

విశ్వనాథంగారిది చాలా పొడవయిన విగ్రహం ముఖంలో ఇంకా తగ్గని వర్చస్సు కాకపోతే వయసు మీద పడిందంతే

ఎల్లలందరితోటీ అలా గుంపుగానడుస్తున్న విశ్వనాథం గారిని చూస్తుంటే ఊడలఱ్రికి కాళ్ళొచ్చినట్టుంది అక్కడి దృశ్యం

సుందరమయిన పూల తోటకు మాలిలాగా వున్నారాయన

అలా కొంచెంసేపు నడవగానే మేష్టారి ఇల్లు వచ్చేసింది

ఎల్లలందరూ ఆప్యాయంగా ఆయన్ని కౌగలించుకొని


సార్! మా జ్ఞాపకార్ధం ఈ వస్తువులన్నీ మీరే వుంచుకోండి! ప్లీజ్ కాదనకండి సార్! అని వాళ్ళ చేతుల్లోని వస్తువులన్నీ ఆయన సంచీలో వేసేసారు ప్రేమగానూ ఆప్యాయంగానూ ఆయన చేతుల మీద ముద్దులిచ్చారు వదలలేక వదలలేక ఆయన్ని వదిలి వెళ్ళారు ఆ వెళ్ళడంలో కూడా వారికెంతో బాధ ఇంత మంచి మేష్టారు రేపట్నుంచి స్కూలుకు రారనే దిగులు


ఆ సంఘటన విశ్వనాథం గారిని బాధతో ముంచెత్తింది తన ప్రియ శిష్యుల అభిమానానికి ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి

అందరూ వెళ్ళిపోయినా సుధాకర్ ఇంకా అక్కడే నిలబడి వున్నాడు అది చూసి ఏం బాబూ! ఇంకా నిలబడే వున్నావేం! ఏం కావాలి నీకు? ప్రశ్నించారు మేష్టారు

ఏంలేదు సార్! అందరి వస్తువులూ ఇచ్చేశారు కానీ మాట పెగల్లేదు అతనికి

అర్ధమయింది నాయనా! అర్ధమయింది ఓ రోజు






క్లాసులో గొడవ చేస్తుంటే అరిచానని అలిగి నే రోడ్మంట వెళ్తున్నప్పుడు చెట్టు చాటు నుంచి రాయి విసిరింది నువ్వే కదూ! నాకు తెలుసు అయినా ఇందులో అంత బాధ పడాలిసిందేమీ లేదులే! నాకు గాయం మిగిల్చావుకదా! అంటూ సంచీలో చెయ్యి పెట్టి వెతికి ఓ కంకర్రాయి బయటకు తీసి ఇదుగో నీ రాయి నువు తీసుకెళ్ళు అని అతనికి ఇచ్చారు ఆ అబ్బాయి దుందుడుకుతనానికి విచారిస్తూ తనని రాయితో కొట్టాడన్న బాధ ఇప్పుడాయనకు లేదు కాకపోతే ఆ కుర్రాడి అకతాయితనం ముందు రోజుల్లో అతన్నే రకంగా తయారు చేస్తుందోనని ఆయన దిగులు

అది గ్రహించిన సుదాకర్ దుఃఖం ఆపుకో లేకపోయాడు వలవలా ఏడుస్తూ మేష్టారి కాళ్ళ మీదపడి క్షమాపణలు కోరాడు

మేష్టారు సుదాకర్‌ని పైకి లేవదీసి నీ గుర్తుగా ఈ రాయి నా దగ్గరే వుంచుతా పసితనంతో చేసిన తప్పుల్ని పట్టించుకోనులే అని అనునయిస్తూ ఇంటికెళ్ళమని సలహా యిచ్చారు

సుదాకర్ వెంటనే ఆ రాయిని మేష్టారికిచ్చేశాడు. ఆయన్ని వదలలేక వదలలేక ఇంటి ముఖం పట్టాడు ఆయన పట్ల తను చేసిన అపచారానికి దుఃఖిస్తూ

కాస్సేపు వెళ్తున్న ఆ ఎల్లవాడి వంకే చూసి ఆ తరువాత విశ్వనాథంగారు చిన్నగా నడుస్తూ ఇంట్లోకెళ్లారు

* * * * *

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది భార్య ఎక్కడో పెరట్లో వున్నట్టుంది తిన్నగా లోపలి గదిలోకెళ్ళి మూలగా వున్న కుర్చీలో చతికిలబడ్డారాయన ఎన్నో ఎళ్ళ నిస్పృహ ఆయన్ను ఆవరించుకొంది నేటి నుంచీ ఆ స్కూలుతో వున్న సంబందాలు తెగిపోయాయి ముఖ్యంగా గత రెండు సంవత్సరాల నుంచీ తన క్లాసు ఎల్లలతో ఏర్పడిన బంధం అది తల్చుకుంటేనే ఆయన కళ్ళు చమర్చాయి ఆ ఎల్లల మీద ఏర్పడిన మమకారం ఆయన్ని కుదిపేసింది దాంతో చుట్టుప్రక్కల వాతావరణం కూడా మూల్గుతున్న రోగిలాగా అనిపించింది ఆయనకు వొళ్లంతా బారంగా వుంది కారణం తెలీదు కానీ పెద్దగా ఏడవాలనిపించింది ఆయనకు అంతే! తృప్తిగా ఏడ్చేసి ఆ భారాన్ని దించేసుకున్నారు కాసేపటికి కానీ ఆయన మనసు కుదుటపడలేదు

కాస్త తేలిగ్గా అనిపించటంతో ఎల్లలంతా తనకు ఇచ్చిన వస్తువులను ఒక్కొక్కటే సంచీలో నుంచి బయటకు తీసి చూసుకుని మురిసిపోయారు ఇంతలో యదాలాపంగా ఆయన దృష్టి తన వొంటి మీదున్న లాల్చీమీద పడింది ముందు భాగమంతా దట్టంగా ఎరా కొట్టబడి వుంది అది చూసి ఆయన ఆశ్చర్యపోయారు

ఎవరి పని అయి వుంటుందా ని ఆలోచిస్తున్నారు ఎంత ఆలోచించినా ఆయనకు గుర్తుకు రాలేదు. అలా చాలాసేపు ఆలోచిస్తూనే వున్నారు

ఆర్నెల్ల క్రితం ఓ రోజు క్లాసులో రమేష్ చేసిన చిలిపి అల్లరి గుర్తుకు వచ్చింది ఆయనకు

రమేష్ తెలివైన వాడు చలాకీ అయిన కుర్రాడు కాబట్టి ఆ రోజు మెత్తగా తిట్టి తను వదిలేసాడు

ఈ పని ఖచ్చితంగా రమేష్‌దే అయి వుంటుందన డానికి నిదర్శనం అంత చొరవ ఇంకెవరూ తీసుకోక పోవడమే

గంతలో నుంచి వాస్తవంలోకి వచ్చేశారు విశ్వనాథంగారు మళ్లా లాల్చీ వంక చూసుకున్నారు అయినా తనివితీరక తృప్తిగా చేత్తో తడిమి చూసుకున్నారు

తన ప్రియతమ విద్యార్థి రమేష్ అందించిన తియ్యనయిన బహుమతి చూసుకుని మురిసి పోతున్నారు మేష్టారు.

అంతకు ముందు ఆవేదనతో కుంగిపోయిన విశ్వనాథంగారు కొంచెం రిలీఫ్ గా ఫీలయ్యారు తెలివిగానూ, సయస్ఫూర్తితోనూ ప్రవర్తించి నందుకు రమేష్‌ను మనసులోనే మెచ్చుకున్నారు

ఆ అంతరాంతర ఆనందంలో మునిగి తేలుతూండగా భార్య మంచినీళ్ల గ్లాసుతో వచ్చి నిలబడింది

భార్య చేతిలోనుంచి మంచినీళ్ల గ్లాసందు కుంటున్నారు విశ్వనాథంగారు కొంచెం ముందుకు వంగి అప్పుడు చూసింది ఆమె భర్త లాల్చీ మీద ఎరామరకలు వెంటనే అదేమిటండీ మీ తెల్లటి లాల్చీఅలా ఖరాబు చేసిందెవరు కోపంగా అడిగింది

సమాధానం చెప్పకుండా ఒక్క గుక్కలో నీళ్ళన్నీ తాగేసిమళ్లీ వెనక్కి జారగిలబడి కూర్చుని విలాసంగా కాళ్ళూపుతూ ముసి ముసిగా నవ్వారు

అది చూసి అహం దెబ్బ తిన్నఆయన భార్య మిమ్మల్నే ఎలుస్తూంటే పలక్కుండా ఏమిటలా దిలాసా పోతున్నారు పువ్వు లాంటి మీ లాల్చీ అంత చేటు పాడు చేసిందెవరని అడిగితే చెప్పరేం త్వరగా విప్పదీసి ముందిలా ఇవ్వండి ఉతికి ఆరేస్తాను వెంటనే వుతక్కపోతే మరకలు పోవు కోపంగా గద్దించింది భర్తను

విశ్వనాథం గారికి భార్య మాటలు కొంచెం చివుక్కుమనిపించాయి అయినా నిగ్రహించు కున్నారు జీవితాన్ని ఇంత చదివిన తర్వాత కూడా ఈవిషయం నీకు బోధపడక పోవడం చాలావిచార కరమయిన విషయం అయినా ఓ విద్యార్థి ప్రేమగా పువ్వుల్లో పెట్టి అందించిన తన లేత హృదయాన్ని ఎంత పదిలంగా చూసుకోవాలో తెలుసా? అని ప్రేమగా భార్యను దగ్గరకు తీసుకుని రాసుకునే టప్పుడో మరొకప్పుడో ఎరా వొలికి మీద పడితే వాటిల్ని మరకలంటారేమోగానీ ఇవి మరకలు కావే! తీపి గుర్తులు! జీవితాంతం దాచుకోవలసిన మధుర స్మృతులు ఇవి విషాదాల కడలిలో ఈ గురుతులు తీపి గురుతులుగా మిగిలిపోతాయే వర్రిదానా! అని నచ్చ చెప్పారు

అదేమీ అర్థం కాక అది కాదండీ అని ఏదో చెప్పబోయిన భార్య మాటలకు మధ్యలోనే అడ్డు తగిలారు విశ్వనాథంగారు

జీవితంలో విలువలు నీకేం తెలుసు? నా జీవితంలో నేను ఎదయినాపొరపాటుపనంటూ చేస్తే ఈ లాల్చీ ఉతికించడానికి ఇవ్వడమే! ఇది ఇలాగే శాశ్వతంగా ఉండిపోవాలిసిందే అనేసి

నాయనా రమేష్! నీతోటి విద్యార్థులందరూ బహుమతిగా ఆ వస్తువులు ఇస్తూంటే నువ్వొక్కడివే తల వంచుకుని ఓ పక్కగా ఎందుకు నిలబడ్డావో ఇప్పుడర్థమయింది నీ ఈ అమూల్య మయిన జ్ఞాపికను భద్రంగా వుంచుతాను బాబూ! అనుకుని మరొక్కసారి ఆ లాల్చీ మీది సిరా చుక్కలను ప్రేమగా స్పృశించారాయన వాటినలా స్పృశిస్తూంటే ఆయన సమస్తావయవాలూ ఉల్లాసంతో తేలిపోయాయి ఆ అనుభవంతో అలసి పోయిన ఆయన చిన్ని గుండె ప్రేమగా మూలిగింది ☐